సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 18 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.28 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.28 వేలు పలికాయి. మార్కెట్‌కు 6 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.21
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.21 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.5°/18.2°
జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం పూట చలి వాతావరణం నెలకొంది. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి బాబా 98వ జయంత్యుత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలిసారి పుట్టపర్తికి విచ్చేస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి అధికారులతో సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి తప్పులు దొర్లకూడదని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ... ఈనెల 22వ తేదీన ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత మందిరంలో జరగనున్న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ వార్షికోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటారన్నారు. ఆమె ప్రత్యేక విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారని, తిరిగి వెళ్లే వరకూ భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలన్నారు. విమానాశ్రయం నుంచి నేరుగా సాయి శ్రీనివాస గెస్ట్ హౌస్‌కు చేరుకుని గౌరవవందనం స్వీకరిస్తారన్నారు. అనంతరం సాయికుల్వంత్ మందిరంలో జరిగే వేడుకల్లో పాల్గొని తిరిగి ఢిల్లీ వెళ్తారన్నారు. రాష్ట్రపతి పర్యటనకు పుట్టపర్తిలో సుమారు 2 వేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. సత్యసాయి జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు తాగునీటి వసతి, వైద్యం, పారిశుధ్య కార్యక్రమాలు, విద్యుత్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఈఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, ట్రస్ట్ ప్రతినిధి చలం, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, రవాణా శాఖాధికారి కరుణసాగర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డీఎస్పీలు విజయ్ కుమార్, వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా నరసయ్య



పుట్టపర్తి అర్బన్: గృహనిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్(ఎఫ్‌ఏసీ)గా డీఆర్‌డీఏ పీడీ నరసయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ హౌసింగ్ పీడీగా ఉన్న చంద్రమౌళిరెడ్డి పదవీ కాలం ముగియడంతో నరసయ్యకు హౌసింగ్ పీడీగా పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని హౌసింగ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అదనంగా ఒక టీఎంసీ విడుదలకు విజ్ఞప్తి

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి మరొక టీఎంసీ నీరు విడుదల చేయాలని ఎస్ఈ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తుంగభద్ర బోర్డుకు, జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డికి వేర్వేరుగా లేఖలు రాశారు. బోర్డు అధికారులతో చర్చించారు. ఇందుకు బోర్డు అధికారులు సానుకూలంగా స్పందించారు. దీంతో మరో రెండు రోజుల్లో హెచ్చెల్సీకి నీరు నిలుపుదల కానుండగా.. ఈ నిర్ణయంతో మరో ఐదారు రోజులు పాటు అదనపు టీఎంసీ నీరు రానున్నాయని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. హెచ్ఎల్ఎంసీ కింద సాగులో ఉన్న పంటలకు తడులు అందిస్తామని చెప్పారు. రైతులు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

రారండోయ్ వేడుక చూద్దాం

- నేటి నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ప్రశాంతి నిలయం
- ఏర్పాట్లు పూర్తి చేసిన సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్
- 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్
- 23న సత్యసాయిబాబా జయంతి వేడుకలు
- నేడు పుట్టపర్తిలో వేణుగోపాలస్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహా సమాధి (ఫైల్)



సత్యసాయి చిత్రపటానికి పూజలు చేసి అన్నప్రసాదాల తయారీని ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: 'అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు' అని బోధించి భక్తజన ఇలవేల్పుగా మారిన సత్యసాయిబాబా 98వ జయంత్యుత్సవాలకు ప్రశాంతి నిలయం ముస్తాబైంది. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి భక్తులంతా తరలివచ్చే ఈ విశ్వవేడుక కోసం అటు ప్రభుత్వమూ తగు చర్యలు తీసుకుంది. ఇప్పటికే వేడుక నిర్వహణకు వేదికైన సాయికుల్వంత్ సభా మందిరాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేక పుష్పాలు, దళాలతో సుందరంగా అలంకరించారు. పురవీధులకు మామిడి తోరణాలు కట్టారు. ప్రపంచ నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చే సత్యసాయి భక్తులకు సేవలందించేందుకు సేవాదళ్ సభ్యులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు.

సత్యసాయి జయంత్యుత్సవాలు ఇలా...

- 18న ఉదయం వేణుగోపాల స్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభమవుతాయి. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు మాన్య అరోరా బృందం సంగీత కచేరీ ఉంటుంది.
- 19న ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత మహిళా దినోత్సవం నిర్వహిస్తారు. గౌరవ అతిథిగా మైసూర్ రాజవంశీయురాలు రాజమాతా ప్రమోదాదేవి ఒడయార్, ముఖ్య అతిథిగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శోభా కరంద్లాజే హాజరుకానున్నారు. విదేశీ సత్యసాయి భక్తురాలు పెట్రాకలినోస్కీ మహిళా భక్తులనుద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్ బృందం సంగీత కచేరీ ఉంటుంది.
- 20వ తేదీ సాయంత్రం రాజేష్ వైద్య బృందం సంగీత కచేరీ నిర్వహిస్తారు.
- 21న సాయంత్రం శివశ్రీ స్కంద ప్రసాద్ బృందం సంగీత కచేరీ ఉంటుంది.
- 22వ తేదీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవ వేడుకలు ప్రశాంతి నిలయంలోని సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ విద్యార్థులు కాన్వొకేషన్ డ్రామా నిర్వహిస్తారు.
- 23న సాయికుల్వంత్ సభా మందిరంలో బాబా జయంతి వేడుకలు నిర్వహిస్తారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు పంచరత్న కీర్తనలు ఆలపిస్తారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ట్రస్ట్ వార్షిక నివేదిక సమర్పిస్తారు. సాయంత్రం ప్రశాంతి నిలయం పురవీధుల్లో స్వర్ణ రథోత్సవం, అనంతరం సాయికుల్వంత్ సభా మందిరంలో జోలోత్సవం ఉంటుంది. కౌశిక్ చక్రవర్తి సంగీత కచేరీతో వేడుకలు ముగుస్తాయి.

లక్ష మందికి నారాయణ సేవ

సత్యసాయి జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి తరలివచ్చే భక్తులకు మహానారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా అన్న ప్రసాదాల వితరణ ఉంటుంది. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సర్వం సిద్ధం చేసింది. సత్యసాయి జయంత్యుత్సవాలు జరిగే ఆరురోజులూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో భక్తులకు అన్నప్రసాదాలు వితరణ ఉంటుంది. సుమారు లక్ష మందికి అన్నదానం చేసే లక్ష్యంతో ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వెనుక వైపు ఉన్న మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 850 మంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు నారాయణ సేవలో పాలుపంచుకోనున్నారు. అన్న ప్రసాదాల పంపిణీకి మహిళలు, పురుషులకు వేర్వేరుగా 12 చొప్పున ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. శుక్రవారమే అన్నప్రసాదాల తయారీ ప్రారంభించారు. సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు సత్యసాయి చిత్రపటానికి పూజలు నిర్వహించి అన్నప్రసాద తయారీని ప్రారంభించారు.

22న పుట్టపర్తికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సత్యసాయిబాబా 98వ జయంత్యుత్సవాల్లో భాగంగా నవంబర్ 22న ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవం జరగనుంది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి స్నాతకోత్సవ ఉపన్యాసం చేయనున్నారు. అలాగే విద్యార్థులకు బంగారు పతకాలు అందివ్వనున్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ఆనవాయితీ ప్రకారం శనివారం వేణుగోపాల స్వామి రథోత్సవంతో సత్యసాయి 98వ జయంత్యుత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనం నిర్వహిస్తారు. ఆ తర్వాత సాయికుల్వంత్ సభా మందిరంలో 2 వేల మంది సత్యసాయి భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రశాంతి నిలయంలోని ఉత్తర గోపురం వద్ద నుంచి వేణుగోపాల స్వామి రథోత్సవం ప్రారంభిస్తారు. ఇందుకోసం సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది.

8 రోజుల పాటు వైద్య శిబిరాలు

బాబా జయంత్యుత్సవాల సందర్భంగా ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వద్ద శనివారం నుంచి అంతర్జాతీయ మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. అమెరికాకు చెందిన డాక్టర్.గీతా కామత్ నేతృత్వంలో 8 రోజుల పాటు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు ఐసీయూ, ఆప్తమాలజీ, కార్డియాలజీ, ఈఎన్‌టీ, కేన్సర్, డెర్మటాలజీ, పల్మనాలజీ, గైనకాలజీ, ఫిమేల్ ఓపీడీ, ఆర్థోపెడిక్, సైకియాట్రిక్ సేవలు అందివ్వనున్నారు. రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకూ వైద్య శిబిరాలు కొనసాగనున్నాయి. అవసరమైన మందులను సైతం ఉచితంగా అందిస్తారు.



అలంకరణలో ప్రశాంతి నిలయం ప్రధాన ద్వారం



వీధులను అరటి తోరణాలతో అలంకరించిన దృశ్యం



విద్యుత్ వెలుగుల్లో ప్రశాంతి నిలయం ఉత్తర గోపురం



ఉత్సవానికి సిద్ధమైన వేణుగోపాల స్వామి రథం

జిల్లాలో పకడ్బందీగా కుల గణన



కుల గణనపై మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- నవంబర్ 27 నుంచి డిసెంబర్ 10 వరకూ ప్రక్రియ
- కలెక్టర్ అరుణ్‌బాబు వెల్లడి
- కుల సంఘాల పెద్దలతో సమావేశం

పుట్టపర్తి అర్బన్: ఆర్థిక అసమానతలు తగ్గించడం, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో వివిధ కుల సంఘాలు, ఎన్జీఓలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఈనెల 27 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకూ కుల గణన సాగుతుందన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. అలాగే అన్ని కులాల ప్రజలు సర్వే సిబ్బందికి పూర్తిగా సహకరించాలన్నారు. కుల గణన చేపట్టే రోజున ఆ గ్రామంలో దండోరా వేయిస్తామని, అలాగే ముందురోజే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తెలియజెబుతారన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుల గణన చేస్తారన్నారు. సమాచారాన్ని ప్రత్యేక మొబైల్ యాప్‌లో పొందుపరుస్తారని వెల్లడించారు. అలాగే కుల గణనలో పాల్గొనే సచివాలయ సిబ్బందికి గడువులోపు శిక్షణ పూర్తి చేయాలన్నారు.

ఇంటి యజమాని వేలి ముద్ర తప్పనిసరి..

కుల గణనలో భాగంగా సచివాలయ సిబ్బంది సర్వే పూర్తి చేసిన తర్వాత ఇంటి యజమాని తప్పకుండా వేలిముద్ర వేయాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. యజమాని అందుబాటులో లేకపోతే కుటుంబ సభ్యులు వేలిముద్ర వేయాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రాంతంలో నెట్ వర్క్ లేకపోతే నెట్ వర్క్ ఉన్న ప్రాంతానికి వెళ్లి వేలిముద్ర వేయాల్సి ఉంటుందన్నారు. కుల గణన తర్వాత జిల్లాలో ఏ కులానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారు, వారికి ప్రభుత్వ పథకాలు అందాయా, లేదా అనే వివరాలు తెలుస్తాయన్నారు. అర్హులై ఉండీ సంక్షేమ పథకాలు పొందలేని వారికి వెంటనే మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, వాల్మీకి, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, సీపీఓ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం తదితరులు పాల్గొన్నారు.

రైతుకు సాయంగా నిలుద్దాం

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అవుటాల రమణారెడ్డి
- కరువు జాబితాలో జిల్లాలోని అన్ని మండలాలు చేర్చాలని తీర్మానం





మాట్లాడుతున్న చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పాల్గొన్న వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసే రైతులకు సాయంగా నిలుద్దామని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 21 మండలాలను ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చగా, మిగతా 11 మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలని తీర్మానం చేశారు. అనంతరం సభాధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ... రైతు సంక్షేమం కోసం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రబీ సీజన్‌లో బోర్ల కింద వేరుశనగ పంట సాగుకు అవసరమైన విత్తనాలు అందించాలని, ఇందుకు అవసరమైన నివేదికలను ప్రభుత్వానికి పంపాలన్నారు. అర్హులైన రైతులకు పొట్టేళ్లు, కోళ్లు, పందుల పెంపకం యూనిట్లకు సహకార బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత హామీ ఇచ్చిందన్నారు. ఎస్సీ రైతులకు ఇచ్చే వ్యవసాయ కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్య శాఖ ద్వారా జిల్లాలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. బుక్కపట్నం మండలం తరుగువాండ్లపల్లి వద్ద హంద్రీనీవా కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాగి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు..

జిల్లాలో రాగి సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ చేతన్ సూచించారు. రాగులకు ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తోందని, ఈ విషయాన్ని రైతులకు తెలియజెప్పి రాగులు సాగు చేసేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఈ– క్రాప్ బుకింగ్ వంటివి సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్‌లో రైతులు కొంత మేర నష్ట పోయారని, దీంతో కరువు మండలాల జాబితాను పెంచి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బసిరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణానాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ మురళీ, మైనర్ ఇరిగేషన్ ఈఈ గంగాధర్, విద్యుత్ శాఖ డీఈ శరవణన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- జగన్ పేదల పక్షం.. పెత్తందార్లకే చంద్రబాబు మద్దతు
- రాజకీయాల నుంచి బాబు తప్పుకుంటే ఉత్తమం
- ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కొమ్మినేని శ్రీనివాసరావు

కదిరి/పుట్టపర్తి అర్బన్: 'ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేస్తూ రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయనది పేదల పక్షం..ప్రతిపక్ష నేత చంద్రబాబుది పెత్తందార్ల పక్షం. అందువల్లే ప్రజలు జగన్ పక్షాన ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలవడం ఖాయం..మళ్లీ సీఎం పీఠాన్ని జగన్ అధిష్టించడం ఖాయం' అని ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కదిరి లక్ష్మీ నరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ ఎన్నికలకు మునుపు ప్రజలకిచ్చిన హామీలన్నీ దాదాపుగా నెరవేర్చారన్నారు. పాలనను ప్రజల ముంగిటకే తీసుకొచ్చి అన్ని రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. విశాఖను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, అందువల్లే ఎన్నో కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయన్నారు.

చంద్రబాబు తప్పుకుంటే మంచిది

''స్కిల్ స్కాం కేసులో జైలుకెళ్లి కంటి ఆపరేషన్ కోసం బెయిల్‌పై బయటకొచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇంకా ఎన్నో ఆరోగ్య సమస్యలున్నాయని ఆయన అనుకూల మీడియాతో పాటు కొందరు టీడీపీ నాయకులు చెబుతున్నారు. వారి మాట ప్రకారం చంద్రబాబుకు ఇక పూర్తిగా విశ్రాంతి ఇస్తే మంచిది. ఆయన ఆరోగ్యరీత్యా రాజకీయాల నుంచి తప్పుకుంటే మంచిది'' అని కొమ్మినేని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. అనంతరం కొమ్మినేనిని స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డితో పాటు పాత్రికేయులు కలిసి ఘనంగా సన్మానించారు.

లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.2.50 లక్షల కోట్లు

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల ద్వారా రూ.2.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు చేర్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో విలేకరులతో మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. అధికారం చేపట్టగానే 1.50 లక్షల ఉద్యోగాలిచ్చారని, అలాగే మరో 2.5 లక్షల మందిని వలంటీర్లుగా నియమించి ఉపాధి కల్పించారన్నారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేల ద్వారా రైతుల, ప్రజల అవసరాలను తీరుస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, ట్యాబ్‌ల అందజేత, అమ్మ ఒడి వంటి పథకాలు అర్హులందరికీ అందజేశారన్నారు. అలాగే 13 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చారన్నారు. కొమ్మినేని వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, సమాచార శాఖ ఏడీ వేలాయుధం, మీడియా అకాడమీ ఓఎస్‌డీ శ్రీనివాస్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం చెరువుకు కృష్ణమ్మ

- డిసెంబర్ నెలాఖరులోగా నింపుతాం
- రాగి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

అమరాపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. ముఖ్యంగా సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీఎం సహకారంతో డిసెంబర్ నెలాఖరులోగా అమరాపురం చెరువును కృష్ణాజలాలతో నింపుతామన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని హాలుకూరు రైతు భరోసా కేంద్రంలో రాగి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ.... రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన దిగుబడులు దళారుల పాలు కాకుండా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందన్నారు. ముఖ్యంగా రవాణా, గోనె సంచి, కమీషన్ తదితర ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఊరికో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసిన సీఎం జగన్ రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచారన్నారు. దీంతో రైతులకు వ్యయప్రయాసలు తగ్గాయన్నారు. భవిష్యత్‌లో ప్రతి రైతుభరోసా కేంద్రం కొనుగోలు కేంద్రంగా మారి రైతులకు మేలు చేస్తుందన్నారు. రైతులకోసం ఇంతలా ఆలోచిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అందరం మద్దతుగా నిలిచి మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం అశ్వర్థనారాయణ నాయక్, ఏఓ మంజునాథ, సర్పంచ్ హనుమక్క, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, జేసీఎస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తలుపుల: మండలంలోని బట్రేపల్లి సమీపంలోని క్రాస్‌లో శుక్రవారం లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు చనిపోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తలుపులకు చెందిన రెడ్డి బాషా (24), షామీర్, పవన్ కుమార్ పనినిమిత్తం ద్విచక్ర వాహనంలో కదిరికి వెళ్తున్నారు. అయితే బట్రేపల్లి సమీపంలోని క్రాస్ దగ్గర అటుగా వచ్చిన లారీ అతివేగంగా బైక్‌ను ఢీ కొంది. ఈ ఘటనలో వారు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రెడ్డి బాషా పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మిగతా ఇద్దరిని అనంతపురం తరలించారు.

26 నుంచి వికసిత్ భారత సంకల్ప యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఈనెల 26 నుంచి జనవరి 26 దాకా రెండు మాసాల పాటు నిర్వహించనున్న వికసిత్ భారత సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టర్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ డాక్టర్ కే.సంజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శివకుమారిలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 60 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రతిరోజూ రెండు గ్రామాల చొప్పున ప్రచార రథం ద్వారా సంక్షేమ పథకాలపై ప్రచారం కల్పించనున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని శవం లభ్యం

తాడిమర్రి: మండల పరిధిలోని పెద్దకోట్ల సమీపంలో పార్నపల్లి డ్యాం సమీపంలోని కొండ వద్ద శుక్రవారం ఓ వృద్ధుడి శవం (అస్థిపంజరం)ను కనుగొన్నట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దకోట్ల పంచాయతీ జేఎల్‌ఎం రాజ్‌కుమార్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంలో భాగంగా పనులు చేస్తుండగా శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించామన్నారు. మృతదేహం సమీపంలో ఆకుపచ్చ నలుపు రంగు సోలాపూర్ దుప్పటి, శ్రీసాయి నార్పల జ్యువలరీ అనే చేతి సంచి లభ్యమయ్యాయన్నారు. శవం వద్ద చిల్లర నాణేలు వుండడంతో బిక్షాటన చేసే వాడుగా ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైన వృద్ధుని ఆచూకీ కోసం 9440901893 అనే నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అట్టహాసంగా కల్చరల్ ఫెస్ట్



యువతుల నృత్య ప్రదర్శన



కల్చరల్ ఫెస్ట్‌లో యువతుల సందడి



డ్యాన్స్ చేస్తున్న యువతులు

అనంతపురం: 'అత్యంత విలువైన మానవ వనరులు గల దేశంగా భారత్ ప్రపంచంలో అగ్రగామిగా ఉంది. యువశక్తి శీల దేశంగా భారత్ విరాజిల్లుతోంది' అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఆడిటోరియంలో క్యాంపస్ కళాశాల ఆధ్వర్యంలో తొలిసారిగా ఉత్సవ్ పేరిట విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి పలు కార్యక్రమాలు నిర్వహించారు. అట్టహాసంగా ఉత్సవ్ ఆర్ట్స్, కల్చరల్ ఫెస్ట్–2023 శుక్రవారం ప్రారంభించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల, కలికిరి, ఓటీపీఆర్‌ఐ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1963 బ్యాచ్‌కు చెందిన గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మన పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ సినీ గేయరచయిత చంద్రబోస్ ఉమ్మడి జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి అన్నారు. ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి. మమత, కో–కోఆర్డినేటర్ అంకారావు, డాక్టర్ అరుణలను వీసీ ప్రశంసించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

1963 బ్యాచ్‌లో బీటెక్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరిగింది. ఉత్సవ్‌లో పాల్గొని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆ నాటి గురువులను స్మరించుకున్నారు. ఆనాటి ఆప్యాయతలు, అనురాగాలు స్మరించుకున్నారు.



1963 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులతో జేఎన్‌టీయూ అనంతపురం వీసీ రంగజనార్దన

గోల్డ్ లోన్ పేరుతో మోసం

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హిందూపురం టౌన్: బంగారం తాకట్టు పెట్టి మోసపోయిన ఓ బాధితుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు చిన్న ఆచారి పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు... పట్టణానికి చెందిన చిన్న ఆచారి తన అవసరాల కోసం పట్టణంలోని ధనలక్ష్మీ రోడ్డులో ఉన్న కీర్తన గోల్డ్ లోన్‌లో ఈ సంవత్సరం ఏప్రిల్‌లో తన బంధువులకు సంబంధించిన సుమారు రెండు లక్షలు విలువ చేసే బంగారు నగలు తాకట్టు పెట్టాడు. దీనికి సంబంధించి ఇదే సంవత్సరం జూలై 27న వడ్డీ చెల్లించి రుణాన్ని రెన్యూవల్ చేశారు. అయినప్పటికీ కీర్తన గోల్డ్ లోన్ కార్యాలయ సిబ్బంది సెప్టెంబర్ 9న కేవలం ఒక నోటీసు జారీ చేసి, అదే నెల 30న విజయవాడలో అతని బంగారు ఆభరణాలతో పాటు పట్టణంలో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వారి బంగారు ఆభరణాలను వేలం వేసింది. దీనిని నిరసిస్తూ వారం రోజులు బాధితులు ప్రతిరోజూ కీర్తన గోల్డ్ లోన్స్ వద్దకు వచ్చి వాళ్ల గోడును వెళ్లబోసుకున్నారు. అయితే శుక్రవారం బాధితుడు చిన్న ఆచారి కీర్తన గోల్డ్ లోన్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, బాధితుడితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.



కీర్తన గోల్డ్ లోన్స్ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న చిన్న ఆచారి

సింగల్ వీల్‌పై విన్యాసాలు

- ముగ్గురిపై కేసులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని జాతీయ రహదారి (544ఈ)పై శుక్రవారం సింగల్ వీల్‌పై ప్రమాదకరంగా డ్రైవ్ చేస్తున్న ముగ్గురు ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ వి.శ్రీనివాసులు తెలిపారు. కొల్లకుంట సమీపంలోని బ్రిడ్జి వద్ద వారి ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో ,రద్దీ ప్రాంతాల్లో వాహనాలు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా, సింగల్ వీల్‌పై విన్యాసాలు చేసినా కఠిన చర్యలు తీసుకొంటామని వాహనదారులను హెచ్చరించారు.

బాలకృష్ణపై తిరగబడుతున్న జనం

- ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

హిందూపురం టౌన్: బాలకృష్ణ డౌన్ డౌన్.. బాలకృష్ణ గో బ్యాక్.. బాలకృష్ణ రాజీనామా చేయాలి.. అంటూ హిందూపురం ప్రజల నినదించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ తీరుతో విసుగెత్తిపోయిన హిందూపురం ప్రజలు 'నువ్వు మాకొద్దు బాబోయ్' అంటూ గళమెత్తారు. హిందూపురంలో శుభకార్యానికి విచ్చేసిన బాలకృష్ణను బుధవారం రాత్రి మేళాపురం సర్కిల్‌లో ప్రజలు అడ్డుకున్నారు. ఈ ఘటన మరువక ముందే శుక్రవారం పట్టణంలోని ఆటోనగర్‌లో ప్రజలు బాలకృష్ణ డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులతో నిరసనకు దిగారు. రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చుట్టపు చూపుగా హిందూపురానికి వచ్చి వెళ్తున్న బాలకృష్ణ ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఏనాడైనా ప్రజా సమస్యలపై మాట్లాడారా అని ఆటోనగర్ మహిళలు ప్రశ్నించారు. 'అసలు నీకు ఓట్లు వేసిన ప్రజలు గుర్తున్నారా? ఎన్నికలప్పుడు ఓట్ల కోసమేనా మేము కనిపించేది. నువ్వు గెలిచిన తర్వాత ఆటోనగర్‌లో ఒక్కసారైనా పర్యటించావా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరు నెలల తర్వాత హిందూపురానికి వచ్చిన బాలకృష్ణను కలిసి సమస్యలను విన్నవిద్దామని వెళితే కనీసం కలవనివ్వలేదని, టీడీపీ నాయకులు తమను పోలీసుల ద్వారా నెట్టి వేయించారని వాపోయారు. అసమర్థ ఎమ్మెల్యేను హిందూపురంలో గెలిపించామని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎమ్మెల్యేగా బాలకృష్ణ అనర్హుడు



బాలకృష్ణ మా ఎమ్మెల్యే అని చెప్పుకోవడానికే సిగ్గుపడుతున్నాం. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వచ్చారే కానీ తర్వాత ఇటు తిరిగి చూసిన పాపాన పోలేదు. టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టించుకుని కేటాయించకుండా మొత్తం మెక్కేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే ఆటోనగర్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.

– ముబిషిరా, ఆటోనగర్, హిందూపురం

పోలీసుల సంక్షేమానికి చర్యలు





మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి, గ్రౌండ్‌లో పరేడ్ నిర్వహిస్తున్న హోంగార్డులు, పోలీసులు

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు శ్రమించే పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని పోలీస్ సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. పరేడ్ పరిశీలనకు వచ్చిన ఎస్పీ మాట్లాడుతూ, పోలీసులకు క్రమ శిక్షణ ముఖ్యమన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ పరేడ్‌లో పాల్గొంటూ ఫిట్‌గా ఉండాలన్నారు. విధి నిర్వహణలో చిన్న, చిన్న అవాంతరాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా తనను కలవవచ్చన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులను, బ్యాండ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ కుమార్, ఆర్‌ఐలు రాజశేఖరరెడ్డి, టైటస్, నారాయణతోపాటు హోంగార్డులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలుంటే తెలపండి

పోలీస్ సిబ్బంది సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం పరేడ్ మైదానంలో పోలీస్ దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సమస్యలు తెలుసుకొనేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ దర్బార్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ సాయుధ బలగాలు సద్వినియోగం చేసుకొని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వీలైనంత త్వరగా వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణం అద్భుతం

గుంతకల్లు: గుంతకల్లు డివిజనల్ కంట్రోల్ సెంటర్ భవన నిర్మాణం అద్భుతంగా ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ కొనియాడారు. శుక్రవారం డీఆర్‌ఎం కార్యాలయం సమీపంలో దాదాపు రూ.38.5 కోట్లతో నిర్మించిన కంట్రోల్ సెంటర్ ఆఫీస్‌ను డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వర్క్‌సెంటర్‌లు, సిగ్నల్ అండ్ టెలికమ్ మెయింటెనెన్స్ రూమ్, ఆఫీసర్స్ చాంబర్లు, మీటింగ్ చాంబర్ తదితర విభాగాలను క్షుణంగా పరిశీలించారు. కార్పొరేట్ సంస్థల తరహాలో సెంట్రల్ ఏసీతో రూపుదిద్దుకున్న భవన నిర్మాణం అద్భుతంగా ఉందని జనరల్ మేనేజర్ కితాబిచ్చారు. కంట్రోల్ సెంటర్ నుంచి ఏ రైలు ఎక్కడ వెళ్తుంది.. ఏ స్టేషన్ సమీపంలో ఉంది.. సాంకేతిక కారణాలతో రైలు ముందుకు కదలకపోయినా, లేక రైలు మార్గంలో ఏదైనా ప్రమాదం జరిగినా, సిగ్నల్ అందకపోయినా, ఇతరత్ర కారణాల వల్ల రైళ్లు నిలిచిపోయినా తొలి సమాచారం కంట్రోల్ సెంటర్‌కు వస్తుందన్నారు. త్వరలోనే ఈ సెంటర్‌ను ప్రారంభించి పాత కంట్రోల్ ఆఫీసును ఇందులోకి మార్పు చేయనున్నట్లు తెలిపారు. దేశంలో గుంతకల్లు కంట్రోల్ సెంటర్‌కు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం జీఎం గుంతకల్లు–నంద్యాల సెక్షన్‌లో తనిఖీలు చేపట్టారు.



కంట్రోల్ సెంటర్ వివరాలను జీఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు వివరిస్తున్న డీఆర్‌ఎం మనీష్‌అగర్వాల్

క్రీడా స్ఫూర్తి నింపేలా 'ఆడుదాం ఆంధ్రా పోటీలు'

పుట్టపర్తి అర్బన్: యువతలో క్రీడా స్ఫూర్తి నింపేలా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి జనవరి 25 వరకూ క్రికెట్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. 15 ఏళ్లు పైబడిన వారు స్థానిక సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

సిద్ధమవుతున్న పదోన్నతుల జాబితా

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో పని చేసే ఉద్యోగుల సీనియారిటీ జాబితా సిద్ధమవుతోంది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని జెడ్పీ అధికారులు ఇప్పటికే కోరారు. క్యాడర్ల వారీగా సీనియారిటీ జాబితాను తెప్పించుకుంటున్నారు. 63 మండలాలకు చెందిన ఉద్యోగుల వివరాలన్నీ వచ్చాక సీనియారిటీలో ఎంత మంది ఉద్యోగులు ఉన్నారనే సంగతి తెలుస్తుంది. ఆ తరువాత ప్యానల్ రెడీ చేస్తారు. ఏయే క్యాడర్లలో ఎంత మంది ఉన్నారనే వివరాలు వచ్చాక రోస్టర్ తయారు చేస్తారు. ఖాళీలను బట్టి ఎంత మందికి పదోన్నతులు ఇవ్వొచ్చో లెక్క తేలుస్తారు. సీనియారిటీని బట్టి సమగ్ర వివరాలతో నివేదిక రూపొందిస్తారు. వాటిని డిప్యూటీ సీఈఓ లలితా బాయికి సమర్పిస్తారు. ఆమె పరిశీలించి అంతా సవ్యంగా ఉందనుకుంటే ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌కు ఫైల్ పెడతారు. అక్కడ ఓకే అయ్యాక జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతి కోసం ఫైల్ పంపిస్తారు. ఆ నిర్ణయం తరువాత పదోన్నతులు కల్పిస్తారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే పదోన్నతులు కల్పించాలన్న పట్టుదలతో జెడ్పీ ఉద్యోగులు కసరత్తు చేస్తున్నారు.

జనవాక్కు

మాకూ ఇల్లు మంజూరైంది



హిందూపురంలోని పేట వెంకటరమణస్వామి గుడి వీధిలో ఉంటున్నాం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత మా బతుకులు ఎంతో మారాయి. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. మా అవసరాలు ఏమిటో తెలుసుకుని మరీ ఇంటి వద్దకే అందజేస్తున్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కలకాలం ఉండాలి.

– శాంతమ్మ, 25వ వార్డు, హిందూపురం

ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందాయి



గతంలో ధ్రువీకరణ పత్రాల కోసం రోజుల తరబడి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎన్నో మంచి పనులు చేస్తూ వచ్చారు. మా పిల్లల చదువులకు సంబంధించి ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరమంటే వలంటీర్‌కు అడిగాను. వెంటనే మా ఇంటి వద్దకే వచ్చి వివరాలతో పాటు అవసరమైన పేపర్లు తీసుకెళ్లి ధ్రువీకరణ పత్రాన్ని తెచ్చిచ్చారు. ఒక్క పైసా ఖర్చు కాకుండానే ధ్రువీకరణ పత్రం నా చేతికి అందింది.

– ఓబుళమ్మ, తగరకుంట గ్రామం, కనగానపల్లి మండలం

దేవుడిచ్చిన మనవడు జగన్



వయస్సు పెరగడంతో కంటి చూపు సరిగ్గా కనపడక ఇంటి వద్దనే ఉంటున్న అవ్వతాతలకు దేవుడిచ్చిన మనవడు జగన్. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపులో పైసా ఖర్చు లేకుండా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు తగ్గిందని వైద్యులు గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు కూడా అందించారు. అద్దాలు పెట్టుకున్నాక కంటి చూపు బాగా కనిపిస్తోంది. ఇంటి వద్ద వివిధ పనులు చేసుకోగలుగుతున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది.

– లక్ష్మీనరసమ్మ, బుళ్లసముద్రం, మడకశిర

ప్రభుత్వ విధానాలు బాగున్నాయి




ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు చాలా బాగున్నాయి. విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ బడులకు ఆయువు పోశారు. ప్రస్తుతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ బడుల్లోనే ఎక్కువగా చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అలాగే ఉపాధ్యాయుల కోసం అమల్లోకి తెచ్చిన ఫేషియల్ యాప్ ద్వారా మొదట్లో ఇబ్బంది అనిపించినా ఇప్పుడు అలవాటై సక్రమంగా నిర్వహణ జరుగుతోంది. ప్రభుత్వ విధానాలతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లితండ్రులు చాలా సంతోషిస్తున్నారు.

– రమణారెడ్డి, ఉపాధ్యాయుడు, పుట్టపర్తి

అత్యాచార ఘటనలో నిందితుడి అరెస్టు

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలో పుట్టగూర్లపల్లి గ్రామంలో ఈనెల 10న ఓ మైనర్‌పై జరిగిన అత్యాచార ఘటనలో నిందితుడైన ఎరుకల తిప్పేస్వామిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. మండలంలోని ధనాపురంకు చెందిన ఎరుకల నారాయణప్ప కుమారుడు తిప్పేస్వామి బాలికపై అత్యాచారం చేసిన ఘటన తెలిసిందే. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ముద్దాయిపై అదేరోజు పరిగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే పరారీలో ఉన్న నిందితుడు తిప్పేస్వామి శుక్రవారం మండలంలోని సేవామందిరం క్రాస్‌లో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని హిందూపురం కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించారన్నారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్య



మృతుడు కుమార్

బత్తలపల్లి: కుటుంబ కలహాలతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం బత్తలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... బత్తలపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో బోయ దాసరి కుమార్ (27) మద్యానికి బానిసయ్యాడు. భార్యతో తరచూ గొడవపడుతుండటంతో రెండునెలల క్రితం భార్య శిరీష పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. ఉదయం పక్కింటివారు గమనించగా ఇంట్లో కుమార్ ఉరివేసుకున్న విషయం వెలుగు చూసింది. వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ట్రైనీ డీఎస్పీ ఏవీ పృథ్వితేజ, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యులతో అడిగి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తల్లి ఉమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.